## క్లుప్తంగా

### వరుడికి ఆశీర్వాదం



వరుడిని ఆశీర్వదిస్తున్న నేదురుమల్లి

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని పిగిలాం గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు మల్లెల గురవయ్యనాయుడు కుమారుడు రాజశేఖర్ నలుగు వేడుకల్లో వైఎస్ఆర్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నాడు. వరుడిని ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్ఆర్ సీపీ నాయకులు కృష్ణం నాయుడు, వెంకటరమణనాయుడు, గురవయ్య, మల్లెల వెంకటేశ్వర్లు నాయకుడు, గోపాల్‌యాదవ్, రామ్మూర్తియాదవ్, కాసరం రంగనాథం నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### హెల్మెట్ తప్పనిసరి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శివశంకర్

దక్కిలి: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా వాహనాలు నడపరాదని ఎస్ఐ శివశంకర్ తెలిపారు. మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిపై మార్లగుంట వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్, లైసెన్సు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు.

### నిత్యావసరాల పంపిణీ



కూరగాయలు, కోడిగుడ్లను పంపిణీ చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు రూరల్: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సుబ్బారావు, ఆనంద్ దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడిగుడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కొండాగుంట జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కోటేశ్వరరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, సుబ్బారావు, ఆనంద్, నాగరాజు, చెంచునారాయణ, పురుషోత్తమరావు, ఇబ్రహీం, రజనీకాంత్, సుమన్‌రెడ్డి, సురేష్, రాధయ్య, విశ్రాంత ఉద్యోగి పురుషోత్తమరావు, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

### నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్



దండోరా కాలనీలో పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు రూరల్: నేరాలను నియంత్రణ చేసి ప్రజలకు శాంతిభద్రతలపై అవగాహన కల్పించడమే పోలీసు శాఖ లక్ష్యమని గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని గాంధీనగర్ ప్రాంతంలో ఉన్న దండోరా కాలనీలో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి తనిఖీలు చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 5 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని స్థానికులకు సూచించారు. ఈ తనిఖీల్లో రెండో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు మనోజ్‌కుమార్, తిరుపతయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



ఆలయం వద్ద నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ట

నాయుడుపేట టౌన్: పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో వెలసియున్న శ్రీఅన్నపూర్ణాదేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ధ్వజస్తంభ పునః ప్రతిష్ట వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పూజారి చదలవాడ సోమశేఖర్‌శర్మతో పాటు ఆలయ మాజీ చైర్మన్ కరింబాయి హరిబాబు మొదలియార్, దాతల చొరవతో నూతన ధ్వజస్తంభ పునః ప్రతిష్ట చేపట్టారు. దేవ ప్రయాగ ఉత్తరాది నాగ్ శక్తి పీఠాధిపతి చిదానంద మహారాజ్ స్వామీజీ సారథ్యంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో దేవదాయ శాఖ గూడూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఈఓ ముసుమూరి రవికృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వరి ఎండుతోంది

గూడూరు మండలం పోటుపాళెం గ్రామానికి చెందిన చెరువులో నీరు అడుగంటి పోతుండడంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఐదేళ్లలో ఒక్క సెంటు కూడా ఎండిపోయిన దాఖలాల్లేవు. అయితే ప్రస్తుతం వరి పొట్ట దశకు చేరుకునే సమయంలో చాలినంత సాగు నీరు అందక పూర్తిగా ఎండి పోతోంది.

– చిల్లకూరు

- రైతుల పాలిట శాపంగా సాగరమాల రహదారి నిర్మాణం
- గంగ నీరు చెంతనే ఉన్నా వచ్చే మార్గం లేదు
- నష్టాలు తప్పవని రైతాంగం ఆవేదన

పోటుపాళెం చెరువు కింద పోటుపాళెం, చిల్లకూరు మండలంలోని నాంచారమ్మపేటకు చెందిన చిన్న సన్నకారులు రైతులు 400 ఎకరాలకు పైగా వరి సాగు చేస్తున్నారు. ఈ చెరువుకు సాగు నీరు అందించే పంట కాలువ చిల్లకూరు మండలం వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతం నుంచి వస్తుంది. ఈ ప్రాంతంలో సాగరమాల రహదారి పనులు సాగుతున్నాయి. సదరు కాంట్రాక్టు సంస్థ రోడ్డు పనుల్లో భాగంగా కాలువను ధ్వంసం చేసింది. దీంతో వర్షాల సమయంలో అంతంత మాత్రంగా సాగు నీరు చెరువుకు చేరుకుంది. దీంతో రైతులు చివరి తడులకు గంగ నీటిని అధికారులు అందిస్తారనే నమ్మకంతో సాగుకు సిద్ధమయ్యారు. అయితే చెరువులో నీరు ఫిబ్రవరి మొదటి వారానికే అడుగంటి పోయాయి. గంగ నీరు అందించాలని రైతులు అధికారులకు విన్నవించారు. గంగ నీరు అందించేందుకు అధికారులు సిద్ధమైనప్పటికీ సాగరమాల రహదారి ప్రాంతంలో కాలువ ధ్వంసమై ఉండిపోయింది.



సాగునీరు అందక ఎండిపోయిన వరి, పగుళ్లేనిన భూమి

నీరు వదిలినా వృథా అవుతుందని అధికారులు మిన్నకుండి పోయారు.

**పట్టించుకోని కాంట్రాక్టు సంస్థ**

సాగరమాల రహదారి నిర్మాణ సమయంలో కాంట్రాక్టు సంస్థ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుల సమస్యలను కనీసం పట్టించుకోవడం లేదు. కనీస అవగాహన కూడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ అడ్డు కట్టలు వేయడం, కాలువలు ధ్వంసం చేయడంతో రైతాంగం ఆవేదన అంతా ఇంతా కాదు. తీర ప్రాంతంలోని చింతవరం సమీపంలో ఉన్న బల్లవోలు డ్రెయిన్ వద్ద కూడా వరద నీరు పోకుండా అడ్డుకట్ట వేసేశారు. సుమారు నెల రోజుల తరువాత నాట్లు వేసుకోవాల్సి వచ్చింది. ప్రస్తుతం వరగలి క్రాస్ రోడ్డు ప్రాంతంలో రోడ్డుకు పైపులు వేసి అడ్డుకట్ట వేస్తేనే తెలుగు గంగ నీరు వస్తుంది. పంట తీవ్రంగా నష్ట పోతున్న రైతులకు కాంట్రాక్టు సంస్థ నష్ట పరిహారం చెల్లించేలా అధికారులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.





సాగరమాల రోడ్డు నిర్మాణంలో భాగంగా కాలువపై అడ్డుకట్ట, చెరువులో అడుగంటిన నీరు

**రెండెకరాలు ఎండి పోయింది**



పోటుపాళెం చెరువు ఆయకట్టులో చివరగా నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఈ ఏడాది వరి సాగు చేపట్టా. చెరువులో ఉన్న నీటిని ముందుగా ఉన్న రైతులు వాడుకోవడంతో చివరి ఆయకట్టులోని భూములకు అందించలేని పరిస్థితి ఏర్పడింది. చెరువులో నిండుగా నీటిని నింపేందుకు పలుమార్లు తెలుగుగంగ అధికారులకు విన్నవించాం. పంట కాలువకు అడ్డుగా రోడ్డు పనులు జరుగుతుండడంతో నీరు వదల లేమని తెలిపారు. దీంతో నీరు అందక పంట పూర్తిగా ఎండి పోయింది. నష్ట పరిహారం సాగరమాల కాంట్రాక్టు సంస్థ ఇవ్వాలి, లేకుంటే ఈ ఏడాది పంట నష్ట పోయి అప్పుల పాలు కావాల్సి వస్తుంది.

– హరిక్రిష్ణ, రైతు, నాంచారమ్మపేట, చిల్లకూరు మండలం

**దిగుబడి తగ్గిపోతుంది**



ఎకరం పొలంలో వరి సాగు చేపట్టా. ఆయకట్టుకు చివరగా ఉండడంతో నీరు పూర్తిగా అందించే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో సమీపంలో ఉన్న బోర్ల యజమానులను ఒకటి, రెండు తడుల నీరు అడిగాను. వారు ఇకపై ఇవ్వలేమని చెప్పారు. దీంతో వెన్ను దశలో ఉన్న వరి నీటి తడులు తక్కువగా కావడంతో దెబ్బతింది. ఇదే జరిగితే ఈ ఏడాది పూర్తిగా పంట నష్ట పోవడమే కాకుండా అప్పులు కూడా కట్టలేని పరిస్థితి. పెద్ద రోడ్డు పని అడ్డకాకుండా ఉంటే అధికారులు నీరు ఇచ్చే వారు. కాలువకు రోడ్డు అడ్డం రావడంతో నీరు ఇవ్వడం లేదు. కాంట్రాక్టు సంస్థ వారు మాకు నష్ట పరిహారం ఇవ్వాలి.

– మహబూబ్‌బాషా, సన్న కారు రైతు, నాంచారమ్మపేట, చిల్లకూరు మండలం

**సాగు నీరు ఇచ్చేందుకు సిద్ధం**

పోటుపాళెం చెరువులో నీరు లేదన్న విషయాన్ని గుర్తించాం. అయితే అవసరమైన రైతులు ముందుకు వచ్చి ఈఈని కలసి వినతి పత్రం ఇస్తే నీరు వదిలేందుకు సిద్ధంగా ఉన్నాం. సాగరమాల రహదారి నిర్మాణ సంస్థ వారు వరగలి క్రాస్ రోడ్డు వద్ద పైపు లైన్ పనులు పూర్తి చేస్తే సాగు నీరు అందించే వీలుంటుంది. దీనికి రైతులు కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులను కలసి పనులు త్వరగా చేయించకోవాలి.

– దయాకర్, ఏఈ, తెలుగుగంగ

### ఉచితంగా ప్రమాద బీమా నమోదు

చిల్లకూరు: అసంఘటిత కార్మికులు ప్రమాద బీమా పొందేందుకు ఉచితంగా ఈ శ్రమ అనే పోర్టల్‌లో పేర్లు నమోదు చేసేందుకు ఆయా సచివాలయాలలో మత్స్యకార సహాయకులు, సాగర మిత్రలు శ్రీకారం చుడుతున్నారని ఆదివారం మత్స్యశాఖాభివృద్ధి అధికారి రఘుబాబు కోరారు. చిల్లకూరులో ఆయన మాట్లాడుతూ మండలంలోని అసంఘటిత కార్మికులుగా ఉన్న వారిని ఆయా గ్రామాలలో మత్స్యకార సహాయకులు, సాగరమిత్రలు ఈ శ్రమ పోర్టల్లో నమోదు చేస్తారని అన్నారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఏడాది పాటు ప్రదాన మంత్రి సురక్ష భీమా యోజన (పీఎంఎస్‌బీవై) కింద రూ.2 లక్షలు వరకు బీమా ఉచితంగా కల్పిస్తామన్నారు. నమోదు చేసుకునే సమయంలో ఈకేవైసీ కలిగిన ఆధార్, అనుసంధానమైన మొబైల్ నెంబర్ ఇవ్వాల్సి ఉంటుందని అన్నారు.

### జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ ఆకస్మిక మృతి

నాయుడుపేట టౌన్: నాయుడుపేట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కె.సుమలత(54) ఆదివారం మరణించారు. కొద్ది రోజులుగా ఆమె ఆరోగ్యం సరిలేక హైదారాబాద్‌లోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందారు. దీంతో ఆమె సొంత ఊరైన గుంటూరులో సోమవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు నాయుడుపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి సమాచారం అందింది. జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ మృతిపై డాక్యుమెంట్ రైటర్లు చిగురువాడ అశోక్‌కుమార్, చాగణం గోపి, చాగణం సుమన్‌కుమార్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నాయుడుపేట టౌన్: కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని పీఎం శ్రీ పాఠశాలల రాష్ట్ర నోడల్ అధికారి మస్తానయ్య సూచించారు. పుదూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో పీఎం శ్రీ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న ప్రత్యేక శిక్షణ తరగతులను ఆదివారం రాష్ట్ర నోడల్ అధికారి పరిశీలించారు. గూడూరు డివిజన్ పరిధిలోని 14 మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌లు అవగాహన కల్పించారు. అనంతరం బాలికల గురుకులంలో విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏఎంఓ శివశంకర్, అసిస్టెంట్ ఏఎంఓలు మధు, సారధి, గూడూరు డిప్యూటీ డీఈఓ సనత్, ఎంఈఓ మునిరత్నం తదితరులు ఉన్నారు.



బాలికల గురుకులంలో విద్యార్థినీలతో కలిసి భోజనం చేసిన రాష్ట్ర, జిల్లా అధికారులు

## గుండె వ్యాధులపై అవగాహన



గుండె వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ నాగరాజు

గూడూరు రూరల్: పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నెల్లూరు కిమ్స్(బొల్లినేని) ఆసుపత్రి ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ నాగరాజు గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. గుండె నొప్పి వచ్చినప్పుడు ఛాతీ మీద ఎలా ప్రెస్ చేయాలి, ఎంతసేపు చేయాలి అనే దానిపై సీపీఆర్ డెమో ద్వారా చూపించారు. డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోజూ వ్యాయామం చేయడం ద్వారా గుండె నొప్పి కొంతవరకు నివారించవచ్చని తెలిపారు. వయసుతో సంబంధం లేకుండా గుండె జబ్బులు వస్తున్నాయని, డాక్టర్ సలహా మేరకు అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమణయ్య, కె.వి.హాస్పిటల్ వైద్యులు డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ ప్రకాష్, వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజేంద్రప్రసాద్, వసంత్, శర్మ, నిమ్మకాయల రవి, వెంకటేశ్వర్లు, బాషా, కృష్ణయ్య, సురేష్, ఈతముక్కల రమణయ్య, దాసు తదితరులు పాల్గొన్నారు.

## జోరుగా డీజిల్ అక్రమ వ్యాపారం

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలోని చిల్లకూరు, టెంకాయతోపు, అక్కగారిపేట, గుర్రప్పతోట గ్రామాల వద్ద కొందరు డీజిల్ అక్రమ వ్యాపారం జోరుగా సాగిస్తున్నారు. వ్యాపారులు రహదారి మార్గంలో వెళ్లే వాహనాల నుండి డీజిల్ అక్రమంగా కొనుగోలు చేస్తుండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రానికి చెందిన బొగ్గు లారీలు, జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా గ్రావెల్, కంకర రవాణా చేసే లారీలు, వివిధ కంపెనీలకు చెందిన ట్రాలీ లారీల డ్రైవర్ల నుంచి వ్యాపారులు తక్కువ ధరలకు డీజిల్ కొనుగోలు చేస్తున్నారు. ఈ వ్యాపారం గత కొంత కాలంగా జోరుగా సాగుతోంది. ఈ క్రమంలో రోడ్డు పక్కన లారీలను గంటల తరబడి నిలిపేస్తునానరు. దీంతో దూర ప్రాంతాల నుండి వచ్చే వాహనాలు ఆగి ఉన్న లారీలను ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. లారీ డ్రైవర్ల నుండి ఒక లీటరు డీజిల్ రూ.70 చొప్పున కొనుగోలు చేసి పల్లెల్లో ట్రాక్టర్ల యజమానులకు విక్రయిస్తున్నారు. దీంతో పెళ్లకూరు పెట్రోల్‌బంక్‌పై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇక్కడి నిర్వాహకులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పెద్దగా స్పందించ లేదు. అయితే పోలీసులు కూడా అక్రమ డీజిల్ వ్యాపారుల నుండి నెల మామూళ్లు పుచ్చుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జరిగిన నాలుగు రోడ్డు ప్రమాదాలన్నీ ఆగి ఉన్న లారీలను ఢీకొన్న ఘటనలు కావడం విశేషం. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### బెల్టుపై నారీభేరి

- బెల్టు షాపులు ఎత్తేయాలని మహిళల ఆందోళన



సచివాలయం ఎదుట ఆందోళన

బాలాయపల్లి(సైదాపురం): నిండలి గ్రామంలో ఉన్న బెల్టు షాపు ఎత్తివేయాలంటూ మహిళలు ఆదివారం గ్రామ సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ మద్యం షాపు యజమానులే బెల్ట్ దందాకు తెర లేపారన్నారు. గ్రామంలో ఏకంగా మూడు బెల్ట్ షాపులు ఉండడంతో తమ భర్తలు కూలీ డబ్బులంతా బెల్ట్ షాపులకే ఇచ్చేస్తున్నారని వారు వాపోయారు. బెల్ట్ షాపుల వద్దనే వివాదాలు, గొడవలు జరుగుతున్నాయన్నారు. బెల్ట్ షాపులు ఎత్తివేయకపోతే మండల కేంద్రంలోనే నిరవధికంగా ఆందోళన చేపడుతామని పేర్కొన్నారు. సుధాకర్‌రాజు, మారిశె వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

### తీరంలో ప్రమాదకరంగా జెట్టీ



జెట్టీ పిల్లర్స్ నుంచి కనిపిస్తున్న ఇనుప కమ్ములు

వాకాడు: తూపిలిపాళెం సముద్ర తీరంలో జెట్టీ నిర్మాణం ఏ క్షణానైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. 1990లో ఓ ప్రైవేట్ ఆక్వా కంపెనీవారు ఉప్పునీటి ఎత్తిపోతల కాలవ జెట్టీ నిర్మాణాన్ని సముద్రం లోపల నుంచి నిర్మించారు. ప్రస్తుతం ఈ వంతెన(జెట్టీ) శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది. ఈ వంతెన దాదాపు 200 మీటర్లు వరకు సముద్రం లోపలికి ఉండి అక్కడ నుంచి 3 కి. మీ పొడవున ఆక్వా కంపెనీకి ఉప్పునీటిని చేరవేస్తుంది. ప్రస్తుతం ఈ వంతెన బాగా దెబ్బతిని పిల్లర్స్‌లో సిమెంటు పెచ్చులు ఊడిపోయి ఇనుప కమ్ములు దర్శనమిస్తున్నాయి. ఎక్కువ మంది పర్యాటకులు జెట్టీ అందాలను చూసేందుకు వచ్చి స్నానాలు చేసి ప్రమాదాల బారిన పడుతున్నారు. తూపిలిపాళెం గ్రామ సమీపంలోని స్వర్ణముఖి అతిథిగృహం ఎదురుగా ఉన్న మొదటి ఘాట్‌లోనే స్నానాలు చేయాలని, జెట్టీ వద్దకు పోరాదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అధికారులు చర్యలు తీసుకుని ముందే కూల్చే ప్రయత్నం చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.

### సత్యమ్మ తల్లికి పాల పొంగళ్లు

కలువాయి: గ్రా మదేవత సత్య మ్మ తల్లికి ఆదివారం తోపుగుంట అగ్రహారం గ్రామస్తులు పా ల పొంగళ్లు పె ట్టుకున్నారు. స త్యమ్మను పూల తో విశేషంగా అ లంకరించి ఆలయంలో పూజలు చేశారు. భజన కార్యక్రమాలు భక్తులను అలరించాయి. తోపుగుంట వాసులతోపాటు చుట్టుపక్కల గ్రామాలవారు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు.

### అంకమ్మ తల్లికి పూజలు

రాపూరు: వేపినాపి సమీపంలో పోతుకొండలో కొలువై ఉన్న అంకమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఉదయం అభిషేకం, ప్రత్యేక పుష్పాలతో పూలంగిసేవ నిర్వహించారు. అమ్మవారిని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలిచ్చారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

### విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను సత్కరిస్తున్న ఉపాధ్యాయ బృందం

చిట్టమూరు: మండలంలోని కొత్తగుంట గ్రామంలోని టీఎంఆర్ పాఠశాలలో గత ఏడాది ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాల వార్షికోత్సవంలో భాగంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరిస్తున్నట్లు తెలిపారు. క్రీడా పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కళాశాల డైరెక్టర్ విజయలక్ష్మీ, ప్రిన్సిపల్ రహమతుల్లా, మేనేజర్ ఆశా, శీనయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### గడ్డి మందు తాగి మహిళ మృతి

నాయుడుపేట టౌన్: మండల పరిధిలోని కుప్పరగుంట గ్రామానికి చెందిన పైడి పోలమ్మ(57) అనే మహిళ గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పుదూరు పంచాయతీ కుప్పరగుంట గ్రామానికి చెందిన పోలమ్మ మతి స్థిమితం సరిగా లేక ఇంటి వద్దనే ఉంటుంది. శనివారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గడ్డి మందు తాగింది. ఆమెకు నాయుడుపేట వైద్యశాలలో ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. అక్కడి ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతురాలి భర్త పైడి కస్తూరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### కార్డన్‌సెర్చ్‌లో 9 వాహనాలు స్వాధీనం

కోట: శ్యాంసుందరపురంలో ఆదివారం పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా ఆధ్వర్యంలో పోలీసులు ప్రతి ఇంటిలో తనిఖీలు నిర్వహించారు. అనుమానితుల నుంచి వివరాలు సేకరించారు. ఈ క్రమంలో ఎటువంటి ఆధారాలు లేని 8 మోటార్‌బైక్‌లు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు.

### వేడుకగా కుంభాభిషేకం



హోమ పూజలు నిర్వహిస్తున్న టీటీడీ ఆగమ పండితులు

నాయుడుపేట టౌన్: తుమ్మూరు గ్రామంలో టీటీడీకి అనుబంధంగా ఉన్న శ్రీగంగా కామాక్షి సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయ కుంభాభిషేక వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం నుంచి భక్తిశ్రద్ధలతో కుంభాభిషేక పూజలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి విశేష ద్రవ్యాలతో హోమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు శాంతి కల్యాణోత్సవంతో కుంభాభిషేక వేడుకలు ముగియనున్నాయి. టీటీడీ డిప్యూటీ ఈఓ జి.దేవేంద్ర బాబు, ఏఈఓ కె.సుబ్బారాజు, సూపరింటెండెంట్ జి.జ్ఞానప్రకాష్, ఇంజినీరింగ్ అధికారి అంజనేయరాజు, ఇన్‌స్పెక్టర్లు సి.సుధీర్, బి.హరిరెడ్డి పాల్గొన్నారు.

## నెల్లూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపిక



నెల్లూరు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టుతో పీడీ, పీఈటీలు

చిల్లకూరు: రాష్ట్రస్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలకు 16 మంది క్రీడాకారులతో ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు హ్యాండ్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి, గురుకుల పాఠశాల పీడీ శ్రీరేష్ తెలిపారు. ఆదివారం చిల్లకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా జట్టు ఎంపికకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో 20 మందికి క్రీడాకారులు వివిధ పాఠశాలల నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీరేష్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో కర్నూలులోని క్రీడా మైదానంలో ఈ నెల 21, 22, 23వ తేదీలలో హ్యాండ్ బాల్ పోటీలు నిర్వహించినున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో నెల్లూరు జిల్లా జట్టు పాల్గొనేందుకు క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ముత్తుకూరులోని శ్రీచైతన్య పాఠశాల పీడీ హేమంత్, పీఈటీ అఖిల్‌తేజ తదితరులు పాల్గొన్నారు.

### ఫలసరుకులు పంపిణీ

గూడూరు రూరల్: డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిరుపేదలకు ఫలసరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి డాక్టర్లు సి.జనార్ధన్‌రెడ్డి, రోహిణిలు దాతలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధి బండి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ సి.ఆర్.రెడ్డి పేరుమీద గత నాలుగేళ్లుగా క్రమం తప్పకుండా ప్రతినెలా 3వ ఆదివారం నిరుపేదలకు నెలకు సరిపడా ఫలసరుకులను పంపిణీ చేయడం గొప్ప విషయమన్నారు. యువత సేవా కార్యక్రమాలపై దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు జైపాల్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, కిషోర్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫలసరుకులు అందజేస్తున్న సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు

## కేంద్రానిది కార్పొరేట్ల బడ్జెట్



మాట్లాడుతున్న వామపక్ష నాయకులు

గూడూరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ఈ నెల 1వ తేదీన ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదలది కాదని, కార్పొరేట్ల బడ్జెట్ అని సీపీఎం కార్యదర్శి జోగి శివకుమార్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ప్రభాకర్ విమర్శించారు. గూడూరు పట్టణంలోని మాయాబజారు ప్రాంతంలో ఉన్న సీపీఎం కార్యాలయంలో ఆదివారం వామపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే ఉందన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులు బడ్జెట్‌పై మాట్లాడక పోవడం దారుణమన్నారు. ఖనిజ సంపదను కార్పొరేట్లకు అప్పగించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. బడ్జెట్‌పై కరపత్రాలు ముద్రించి ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరుస్తామని తెలిపారు. ఈ నెల 20న గూడూరు టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతామని పేర్కొన్నారు. సీపీఎం నాయకులు వెంకట్రామిరెడ్డి, బి.వి.రమణయ్య, సురేష్, పుట్టా శంకరయ్య, పామంజి మణి, చంద్రయ్య, ఆర్.శ్రీనివాసులు, రమణయ్య, అడపాల ప్రసాద్, సీపీఐ నాయకులు కాలేషా, శశికుమార్, ఎంబేటి చంద్రయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.